# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **బీహార్ లోని గయాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.**

2. **గోదావరి, కృష్ణా నదుల వరద పరిస్థితి, రాష్ట్రంలో ఎరువుల లభ్యతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమీక్ష నిర్వహించారు.**

3. **రాష్ట్రంలో ఎవరి పింఛను తొలగించమని రాష్ట్ర పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.**

4. **గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి 1,300 కోట్ల రూపాయలు కేటాయించామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు బీహార్ లోని గయాలో 13 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం గయా ఢిల్లీ మధ్య అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్, వైశాలి – కోడెర్మా మధ్య బౌద్ధ సర్క్యూట్ రైళ్లను ప్రారంభించారు. అలాగే ముజఫర్పూర్ లో హోమి భాభా క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధనా కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ 26 సెకన్లు

కాగా ఈ రోజు సాయంత్రం పశ్చిమ బెంగాల్ లో ప్రధానమంత్రి పర్యటించి కోల్ కతా మెట్రో రైలు సేవలను ప్రారంభిస్తారు. అలాగే, 5 వేల 200 కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు.

--------------------------

గోదావరి, కృష్ణా నదులకు ఎగువ నుంచి వస్తున్న భారీ ప్రవాహాలు, వరదల పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఢిల్లీ నుంచి శ్రవణ మాధ్యమం ద్వారా తాజా పరిస్థితులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వరదల కారణంగా పరివాహక ప్రాంతంలోని గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

వరదలు, వర్షాలపై ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్లకు నిరంతరం ఖచ్చితమైన సమాచారాన్ని పంపాలని సూచించారు.

అలాగే రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందుల లభ్యత, సరఫరా అంశంపైనా ముఖ్యమంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు.ఎరువుల కొరత లేకుండా అధికార యంత్రాంగం పనిచేయాలని సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎరువుల కొరత అనే సమస్య ఉన్నట్లు ఎక్కడ నుంచి సమాచారం వచ్చినా...రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు.

---------------------------

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి నదికి వరద ఉధృతి పెరిగింది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం మరింత పెరగడంతో అధికారులు రెండో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ నుంచి సముద్రంలోకి 13 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. సాయంత్రానికి బ్యారేజీకి 14 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశముందని తెలిపారు.

మరోవైపు వరద నీరు చేరడంతో గోదావరి నదీపాయలు వశిష్ఠ, వైనతేయ, గౌతమి నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం మండలంలోని నాలుగు లంక గ్రామాల ప్రజలు మరపడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. వరద ఉధృతి దృష్ట్యా ఆయా గ్రామాల్లోని విద్యార్థులకు తహసీల్దార్ సెలవులు ప్రకటించారు. వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.

---------------------------

ఇదిలా ఉండగా కోనసీమ జిల్లాలో గోదావరి వరదల పరిస్థితిపై జిల్లా ఇన్చార్జి మంత్రి అచ్చెన్నాయుడు జిల్లా అధికారులతో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. వర్ష ప్రభావిత ప్రాంతాలపై కలెక్టర్, ఎస్పీలతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వరద ముప్పు గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సహాయక చర్యల్లో ఎలాంటి లోటు ఉండకూడదని స్పష్టం చేశారు. గోదావరి వరదల పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని అచ్చెన్నాయుడు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఎవరి పింఛను తొలగించమని రాష్ట్ర పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. అమరావతి సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయలతో మాట్లాడుతూ, అనర్హులైన వారి పింఛన్లనే ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో దివ్యాంగ పింఛనుదారుల నగదును పెంచామని మంత్రి వివరిస్తూ,

వాయిస26 సెకన్లు

---------------------------

ఢిల్లీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటిస్తున్నారు.మరికాసేపటి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర మంత్రికి వివరించి, రాష్ట్రానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేయనున్నారు. ముఖ్యమంత్రితో

పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఈ సమావేశంలో పాల్గొననున్నారని అధికారులు తెలిపారు. తర్వాత ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగరియాతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. సాయంత్రం ఢిల్లీలోని ఒక ప్రైవేటు హోటల్ లో నిర్వహించే వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొంటారని ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

---------------------------

అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా ఇళ్ళు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు గద్దె రామ్మోహన్ చెప్పారు. విజయవాడలోని కామినేని నగర్‌లో ఆయన ఈ రోజు పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుకున్నారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఉండేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. లబ్ధిదారులు ఇళ్ళు నిర్మాణం చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2 లక్షల రుపాయిలు మంజూరు చేస్తాయని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ 31 సెకన్లు

---------------------------

రాష్ట్రం లోని గిరిజన ప్రాంతాల్లో రహదారుల అనుసంధాన పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా చేసేందుకు రహదారుల నిర్మాణానికి 1,300 కోట్ల రూపాయలు కేటాయించామని, ఇప్పటికే 1,100 గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించామని తెలిపారు. గిరిజన గ్రామాల అభివృద్ధి పనుల పురోగతి వంటి వివరాలతో అనుసంధాన పనులపై నివేదికను రూపొందించాలన్నారు. అలాగే నీటి సదుపాయం లేని గ్రామాలకు తక్షణమే ప్రణాళికలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 527 పాయింట్ల నష్టంతో 81 వేల 461 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 165 పాయింట్ల నష్టంతో 24 వేల 917 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పలు జిల్లాల్లో ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

====================